మందకొడిగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- వచ్చిన దరఖాస్తులు 1.46 లక్షలు
- 31 శాతం మాత్రమే సర్వే పూర్తి
- సిబ్బంది కొరతతో ఆపసోపాలు పడుతున్న గృహ నిర్మాణ శాఖ
- సర్వే సిబ్బంది కోసం పలు శాఖలకు ఆదేశాలు జారీ చేసిన అదనపు కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వేను ప్రారంభించింది. సిబ్బంది కొరతతో ఆ సర్వే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మందకొడిగా సాగుతోంది. జిల్లాలోని 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1.46 లక్షల దరఖాస్తులు రాగా..ఇప్పటి వరకు కేవలం 31 శాతం మాత్రమే పూర్తయ్యాయి.పెద్ద గ్రామ పంచాయతీలతో పాటు పురపాలక సంఘాల్లో మందకొడిగా సర్వే జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా అందిన 1.46 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి 34 గ్రామ పంచాయతీలలో 34 మంది, 13 పురపాలక సంఘాల పరిధిలోని 285 వార్డుల వారీగా 285 మంది సర్వేయర్లను నియమించారు.

31న ముగుస్తున్న గడువు

ఈ నెల 9 నుంచి సర్వే ప్రారంభమైనా... ఇప్పటి వరకు 31 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఈనెల 31వ తేదీ వరకు పూర్తి చేయాల్సి ఉంది. దరఖాస్తుదారుడు అందుబాటులో ఉండి, అవసరమైన పత్రాలు అందిస్తే పది నిమిషాల్లో ప్రక్రియను పూర్తి చేయవచ్చని, పలు గ్రామాల్లో ఫోన్ సిగ్నల్స్ సమస్యతో ఆలస్యమవుతోందని సర్వేయర్లు చెబుతున్నారు.

గత లబ్ధిదారులపై ఆరా..

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధి పొందారా? అనే విషయం సర్వే యాప్‌తో తెలిసిపోతున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఉంటున్న ఇంటి స్వరూపం ఎలా ఉంది, గదులు, కుటుంబ సభ్యుల వివరాలు తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం ఉందా? ఉంటే వాటికి సంబంధించిన పత్రాలు, లేకపోతే ఇంటిపన్ను రసీదు, కరెంటు బిల్లు, సాదాబైనామా పత్రం స్కానింగ్ చేస్తున్నారు. దరఖాస్తుదారుడి ఫొటోతో పాటు ఇంటి స్వరూపానికి సంబంధించిన మూడు ఫొటోలు తీస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు కుమారులు పెళ్లి చేసుకుని ఒకే ఇంట్లో వేర్వేరుగా నివాసముంటున్న వారు ముందే దరఖాస్తు చేసుకుని ఉంటే వారికి అదే స్థలంలో వేర్వేరుగా సర్వే చేస్తున్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, తలారి సాయి ముదిరాజ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ, యువజన సంఘం సభ్యులు మేయర్‌ను కలిశారు. ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై మేయర్‌కు వినతిపత్రం అందజేశారు.

సీసీ కెమెరాలతో మరింత భద్రత



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మల్లేష్

రంగారెడ్డినగర్: సీసీ కెమెరాల ఏర్పాటుతో స్థానికంగా భద్రత పెరుగుతుందని జీడిమెట్ల సీఐ మల్లేష్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని శ్రీరామలింగేశ్వర, ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇటీవల ప్రార్థనా మందిరాలపై దాడులు పెరిగిపోయాయని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అలాంటి వాటిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, తిమ్మయ్య, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనాథ్, రాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



తన్నీరు శ్రీనివాస్, అధ్యక్షుడు

నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ నూతన అసోసియేషన్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలోని చర్ల ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాస్, కాలనీ ప్రధాన కార్యదర్శిగా కొలిపాక వెంకట్, కోశాధికారిగా ఓర్సు లింగస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా ముక్కర్ల లాలయ్య, నాగేంద్రచారి, ఉపాధ్యక్షులుగా దేవేందర్ గుప్తా, శ్రీనివాస్, రాముయాదవ్, మల్లికార్జున్, జాయింట్ సెక్రటరీలుగా మారుతి కుమార్, కేవీవీ సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఆదిత్యగార్డెన్స్ కాలనీలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మిస్పా, మన్రే క్రిస్టియన్ అసెంబ్లీస్ సభ్యులు అంజిరెడ్డి, లలిత దంపతులు ఈ వేడుకలను నిర్వహించారు. లోక రక్షణకు జీసస్ చేసిన త్యాగాన్ని వివరించారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. క్రిస్మస్ కేక్ కట్ చేశారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో అలీం ఉద్దీన్ అన్సారీకి రూ.60 వేలు, తలారి సంపత్‌కు రూ.60 వేలు, లక్ష్మికి రూ. 12, 500, కమలకు రూ. 20, 500, సాంబశివరావుకు రూ.55 వేల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గారావు, మల్లం శ్రీను, గుబ్బల రమణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



దుండిగల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నల్లగొండ పట్టణంలో మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం దుండిగల్ మండల గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, మండల అధ్యక్షుడు హనుమాండ్లు, మండల ప్రధాన కార్యదర్శి రాజా, మండల సహాయ కార్యదర్శి మల్లేశప్ప, మండల ఉపాధ్యక్షులు జై ఈశ్వర్, శ్రావణి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



ముగింపు కార్యక్రమానికి హాజరైన నిపుణులు

నిజాంపేట్: మైక్రో ఎలక్ట్రానిక్స్, కంప్యూటింగ్ రంగాల్లో చోటు చేసుకుంటున్న నూతన సాంకేతికతపై బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో మూడు రోజుల పాటు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు జపాన్ డమాస్కస్ సంస్థకు చెందిన డాక్టర్ అకిహికో సుగియానా ప్రత్యక్షంగా, బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన న్యూరో పరిశోధన కేంద్రం సంచాలకులు డాక్టర్ కేవీఎస్ హరి ఆన్‌లైన్ వేదికగా సదస్సులో పాల్గొని విలువైన ప్రసంగం చేశారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటింగ్ రంగాల్లో నేడు ఊహకు అందని విధంగా సాంకేతిక అభివృద్ధి జరుగుతోందని, సాంకేతికతను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలన్నారు. సదస్సులో ముఖ్యంగా ఏఐ, మెషిన్ లెర్నింగ్, సెమీ కండక్టర్, కమ్యూనికేషన్ రంగాలపై చర్చ జరిగింది. సదస్సు విజయవంతం కావడంతో విద్యార్థి పురోగాభివృద్ధి డీన్ డాక్టర్ పద్మశాయి కృతజ్ఞతలు తెలిపారు.

హైడ్రాకు చట్టబద్ధత ఉందా?

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



దుండిగల్: కరోనా వచ్చిన సమయంలో ప్రపంచం భయపడిందని, హైడ్రా వస్తే హైదరాబాద్ గడగడలాడుతోందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శాసనమండలి సమావేశాల్లో ఆయన హైడ్రాపై గళమెత్తారు. అసలు హైడ్రాకు చట్టబద్ధత ఉందా? అని ప్రశ్నించారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకున్నా హైడ్రా కూల్చివేతలు చేపట్టిందని, శుక్రవారం రోజునే పని గట్టుకుని కూల్చివేస్తున్నారని, శని, ఆదివారాల్లో నిర్మాణదారులు హైకోర్టును ఆశ్రయించవద్దనే కుట్ర పన్నుతుందన్నారు. హైడ్రా దూకుడుతో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని, కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిరుపేదల నివాసాలను కూలుస్తున్న హైడ్రా అధికారులు.. సీఎం సోదరుడికి మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భార్య హత్య కేసులో భర్త రిమాండ్



నిందితుడు వెంకట్

కుత్బుల్లాపూర్: భార్య హత్య కేసులో భర్తను పేట్ బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన మేస్వాడ్ వెంకట్(30), సోని(24) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తలు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కొంపల్లి మజీద్ సమీపంలో నివాసముంటున్నారు. వెంకట్ కూలీ పనులు, సోని హౌస్ కీపింగ్ పనులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తాగుడుకు బానిసైన వెంకట్ తరచూ భార్యను శారీరకంగా హింసించేవాడు. దీంతో పలుమార్లు పెద్దల సమక్షంలో సర్దిచెప్పారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 6 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లిన వెంకట్ 11.30 గంటల సమయంలో తిరిగి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతను భార్యతో గొడవపడ్డాడు. ప్రతి విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకువెళ్తున్నావని, దీంతో తన పరువు పోతోందంటూ గొడవ పడ్డాడు. భార్యను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్న వెంకట్ తన వెంట తెచ్చిన సెంట్రింగ్ స్టిక్‌తో సోని తలపై బాదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో వెంకట్ పరారయ్యాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి ఫోన్ కాల్స్ ఆధారంగా నిజామాబాద్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎస్ఐ మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నిజామాబాద్ ఇందల్‌వెల్ టోల్ ప్లాజా వద్ద బైక్‌పై వెళ్తున్న వెంకట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ..



వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో..

రంగారెడ్డినగర్: గణిత శాస్త్రవేత్త పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలు ఆకట్టుకున్నాయి. సుభాష్‌నగర్‌లోని వివేకానంద్ విద్యామందిర్‌లో ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ హాజరై విద్యార్థుల రూపొందించిన నమూనాలను పరిశీలించి అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బోయిన్‌పల్లి అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రాగా టూల్స్ సెక్షన్ పరిధిలోని రాజ్ ఫుడ్స్ ఫీడర్ 11 కేవీ యూజీ కేబుల్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా రోడ్డు క్రాసింగ్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రాజ్ ఫుడ్స్ ఫీడర్ పరిధిలో రంగారెడ్డినగర్ రాజపూర్ ఏరియా, టిక్నో ఎలక్ట్రికల్ లైన్, బాలాజీ ఎలక్ట్రికల్ లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

రాజ్‌కోట్ సహకార బ్యాంక్‌ను సందర్శించిన పీఏసీఎస్ పాలకవర్గం



సుభాష్‌నగర్: దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిశే నరేందర్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు శనివారం గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ జిల్లాలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సహకార కేంద్ర బ్యాంక్‌ను సందర్శించారు. అక్కడ సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలు, సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, బ్యాంకింగ్ నిర్వహణ తదితర వివరాలను అక్కడి జిల్లా సహకార బ్యాంక్ ఎండీ అమిత్ రామోలియా పాలకవర్గానికి వివరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు పెద్దనోల్ల మల్లేష్, కృష్ణయాదవ్, నరేందర్, శ్రీనివాస్, మధుసూదన్, మదన్‌రావు, సత్యనారాయణ, సీఈవో కృష్ణ పాల్గొన్నారు.

చేతి రాతపై ఉచిత శిక్షణ అభినందనీయం

సుభాష్‌నగర్: చక్కని చేతిరాతతో విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని కుత్బుల్లాపూర్ ఎంఈవో జెమిని కుమారి అన్నారు. గాజులరామారం డివిజన్ నెహ్రూనగర్ జడ్పీహెచ్ఎస్‌లో మూడు రోజులుగా జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణా శిబిరాన్ని శనివారం సందర్శించి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉచిత చేతిరాత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ డైరెక్టర్ వంపు మల్లయ్యను అభినందించారు. శ్రీశైలం, జగదీశ్, పాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణం కూల్చివేత

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని లింగయ్య చెరువు ఎఫ్‌టీఎల్ జోన్‌లో వెలసిన నిర్మాణాన్ని శనివారం ఇరిగేషన్ శాఖ అధికారులు కూల్చివేశారు. స్థానికంగా సర్వే నెంబర్ 21లో 20 ఎకరాల 14 గుంటల విస్తీర్ణంలో లింగయ్య చెరువు విస్తరించి ఉంది. ఇందులో ఓ వ్యక్తి ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఇంటిని నిర్మిస్తున్నాడని సమాచారం అందుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువును పరిశీలించారు. నిర్మాణం ఎఫ్‌టీఎల్ జోన్‌లోకి వస్తుందని జేసీబీతో కూల్చి వేయించారు. సదరు నిర్మాణదారుడు ఎఫ్‌టీఎల్ జోన్‌లోకి రాకున్నా ఎలా కూలుస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

అన్నదానాలు నిర్వహించడం అభినందనీయం



కుత్బుల్లాపూర్: నిరుపేదలకు అన్నదానాలు నిర్వహించడం అభినందనీయమని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు, సత్ జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అన్నారు. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్, బాలానగర్, సూరారం తదితర ప్రాంతాల్లో సుమారు 5వేల మందికి శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్వభోజన సేవా టీమ్ సభ్యులు జయచందర్, పృథ్వీ, తేజ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాను మల్టీ పర్పస్ తరహాలో అభివృద్ధి చేయాలి



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ప్రకాశం పంతులు నగర్‌లోని షాదీఖానాను మల్టీపర్పస్ తరహాలో అభివృద్ధి చేయాలని శనివారం కార్పొరేటర్ రావుల శేషగిరికి ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ప్రకాశం పంతులు నగర్‌లో 2000 గజాల విస్తీర్ణంలో కొన్ని సంవత్సరాలుగా షాదీఖానా ఎంతో మంది ముస్లింలకు ఉపయోగపడిందన్నారు. గతంలో కొన్ని మరమ్మతులు చేపట్టి షాదీఖానా చుట్టూ ప్రహరీ కూడా నిర్మించామన్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని పాత షాదీఖానా తొలగించి, ఆ స్థానంలో మల్టీ పర్పస్ తరహాలో నూతన షాదీఖానాను నిర్మించాలని కోరారు. కార్పొరేటర్ రావుల శేషగిరి మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రషీద్ బేగ్, మూసా ఖాన్, రషీద్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. తేజ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్, జీడిమెట్ల వద్ద జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో వర్మ, అఖిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం గాజులరామారం షణ్ముఖ పీఠం టెంపుల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహదేవపురం చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్ సాతాల గోపాల్ హాజరై కేక్ కట్ చేశారు. పలు ప్రాంతాల్లో పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రధాన చౌరస్తాల వద్ద ఆకట్టుకున్నాయి.



మహదేవపురంలో సాతాల గోపాల్ ఆధ్వర్యంలో..



కొంపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు



ప్రగతినగర్‌లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ శ్యామల తదితరులు



కౌసల్య కాలనీలో.. వైఎస్సార్ సీపీ శ్రామిక సేన తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు నరసింహారెడ్డి



కుత్బుల్లాపూర్‌లో తేజా ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు, నాయకులు